చటుక్కున వాళ్ళిద్దరూ ఆముదం తాగిన మొహం పెట్టేశారు. ''సార్, సార్! క్షమించండి, సార్, కంగార్లో ఎక్కేశాం. ఏదో ఈ తడవకి.''

''డోన్టాక్ నాన్సెన్స్ ఒరేయ్! తీసుకురండ్రా బుక్ చేయిద్దాం''

నా కెందుకో అనుమానం వచ్చి మేము కూర్చునున్న వైపు సీటరు కిందికి చూశాను. అక్కడొక నీళ్ళ మడుగుంది. పార్టిషన్ కున్న కన్నం గుండా నీళ్ళు ఇవతల కొచ్చి గోనెసంచీ మీద రాసున్న పాత ఎర్రసిరా అక్షరాల్ని తడుపుతున్నాయి.

''కన్సొలేషన్స్, బ్రదర్! నీ కన్నా మా చెల్లెలే సాహసవంతురాలనుకుంటాను. మళ్ళీ కలుద్దాం'' అఫ్రికనాట్ కూలీలతో ఆ 'శవాన్ని' పట్టించుకుని వెళ్ళిపోయాడు. అతన్ని బతిమాలుతూ ఆ ఇద్దరు 'హంతకులూ' అతని వెంట పడ్డారు.

నేను దీర్ఘంగా నిట్టూర్చి నా సుందరి వైపు చూశాను. ఆమె కోపంగా నా వైపు చూసింది. నేను పులుకూ పులుకూ చూశాను. ఆమె తీక్షణంగా చూసింది. చూసి చూసి ఇద్దరం ఫకాల్న నవ్వుకున్నాం మా తెలివి తేటలకి !

( ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 19-1-83)

* * *     * * *     * * *

# షో

ఆ ఊళ్ళో కొత్తగా కాలేజీ పెట్టారు.

డిపార్టుమెంటుకి ఒక్కొక్కటి చొప్పున పోస్టులు అనుమతించి, ఆ మేరకు లెక్చరర్లను - కొంతమందిని బదిలీమీద, కొంత మందిని కొత్తగాను ఆ పోస్టుల్లో నియమించారు. ప్రిన్సిపాల్ తరువాత ముందరగా వచ్చి చేరిన వారు తెలుగు, జంతుశాస్త్రం, వృక్ష శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం లెక్చరర్లు. మిగతా లెక్చరర్లు వచ్చి చేరేటప్పటికి రెండు మూడు నెలలు పట్టింది. వీరందర్లోనూ తెలుగు, జంతుశాస్త్రం, వాణిజ్య శాస్త్రం చెప్పే వాళ్ళు గెజెటెడ్ లెక్చరర్లు కాగా, మిగతా సైన్సు వాళ్ళంతా అసిస్టెంటు లెక్చరర్లు.

తాము ముందుగా వచ్చి కాలేజీలో చేరిన కారణంగానూ, తను సహాయంతో ప్రిన్సిపల్ ఇంటర్మీడియట్, డిగ్రీ క్లాసులకు అడ్మిషన్లు చేసిన కారణంగానూ తామే కాలేజీకి పెద్దలమనే భావన సైన్సు లెక్చరర్లలో ప్రబలింది. ప్రిన్సిపాల్ తాలూకు మంచితనం కూడా దీనికి కొంత జత కలిసింది. ఫలితంగా, క్లాసుల్లో పాఠాలు చెప్పీ చెప్పనట్లుగా చెప్పటం, క్లాసులు వదిలే కామన్‌రూమ్‌లోకి వచ్చి కూర్చుని నోటికి వచ్చినట్లు వ్యర్థ ప్రసంగాలు చెయ్యటం, కాలేజీ పనిచేసే సమయంలో కూడా వీలైనప్పుడల్లా గోదావరి గట్టు మీదికి వెళ్ళి హోటల్లో కూర్చోవటం పరిపాటై పోయాయి. విద్యార్థుల భవిష్యత్తును, తర్వాత కొన్ని తరాల జాతిని దెబ్బతీసే ఈ వ్యవహారాన్ని చూసి బాధపడుతున్న లెక్చరర్లు కొందరు లేక పోలేదు. అయితే వాళ్ళ ప్రభావం కుర్రాళ్ళ మీద పనిచేసినంత గాఢంగా వాళ్ళతోటి లెక్చరర్ల మీద పని చెయ్యలేకపోయింది.

సైన్సు లెక్చరర్లు వాళ్ళల్లో వాళ్ళు ముద్దు ముద్దుగా పెట్టుకున్న బిరుదాలు కొన్ని వున్నాయి. జంతుశాస్త్రం లెక్చరర్ పున్నయ్యకు 'బీస్ట్ బ్రదర్' అని పేరు వృక్షశాస్త్రం చెప్పే నాగచంద్రానికి 'నాచుగురుడు' అని పేరు. ఫిజిక్సు భాస్కరరావుకు 'బాయ్' అని బిరుదు. కెమిస్ట్రి మోహన్, పైస ఖర్చు పెట్టాలంటే పది రోజులాలోచిస్తాడు కనుక అతనికి 'మైదాస్' అని పేరు. వీళ్ళు గౌరవించి, తమలో ఒకడుగా భావించే తెలుగు లెక్చరరు ప్రహ్లాద వరదాచారిని మాత్రం వీళ్ళు అతి ముద్దుగా 'పెద్దమనిషి' అనిపిలుస్తారు.

దానికి కారణం లేకపోలేదు. ఎలిమెంటరీ స్కూలు నుంచి సగం వయస్సు మళ్ళాక కాలేజీకి వచ్చిన ప్రహ్లాద వరదాచారికి, 'మంచివాడు' అన్న కిరీటం తన తలమీద ఉన్నంతకాలమూ తనకు ముట్టవలసిన రాబడులూ, అధికారుల అండ వగైరాలకు అంతరాయం ఉండదని బాగా తెలుసు పదిమందిలో తన ఈ కిరీటం నిలబడటం కోసం అతను, వాళ్ళల్లో ఎటువంటి బాధ్యతా రాహిత్యాన్నయినా సహిస్తాడు. తన తోటి వాళ్ళల్లో ఎవరు బాధపడుతున్నా సరే, వాళ్ళు బలహీనులైతే, తనకు ఏమాత్రం పట్టనట్టే ఊరుకుంటాడు. పోతే, సైన్సు లెక్చరర్లకు కావలసింది, తమ తాలూకు పన్లు గానీ, మాటల్ని గానీ విమర్శించని వాడు, తమ తప్పుల్ని కప్పిపుచ్చుతుండేవాడు, పై పెచ్చు తమను ఆశీర్వదిస్తూ ఉండేవాడు అయిన ఒక పండుతల ! అతగాడు వీళ్ళకు తెలుగు ఆచారిలో దొరికాడు.

ఇహపోతే, లెక్కల తిరుమలాపతి, 'అయ్యో, విద్యార్థులు దెబ్బతింటున్నారే' అని బాధపడేవాడు. సైన్సు లెక్చరర్లు అతన్ని 'కుతర్కం పంతులు' అని ఎద్దేవా చేసినప్పుడల్లా నవ్వి ఊరుకుంటాడే గాని మాట్లాడడు. దానిక్కారణం, అతను వాళ్ళదగ్గర వందల మీద ఋణగ్రస్తుడు.

కొత్త కాలేజీ కావటాన, రెండు పాకలు రెండు ఆస్‌బెస్టాస్ షెడ్లు మాత్రమే లేచాయి. వేరేచోటులేక, కామన్‌రూమును ఒక షెడ్డులో ఏర్పాటుచేశారు. బాటనీ జువాలజీ ప్రయోగశాలలకూ మధ్య ఒక తడికె ఉంది కాని, జువాలజీ ప్రయోగశాలకు కామన్‌రూముకూ మద్య ఆ మాత్రం కూడా లేదు. క్లాసుల్లేని సమయాల్లో లెక్చరర్లు కూర్చోవటానికి కాస్త స్థలం అంటూ మూడు పెద్ద బల్లల చుట్టూ ఉన్న పదిహేను కుర్చీల్లోనే.

★ ★ ★

ఒకరోజు మధ్యాహ్నం ఫిజిక్సు కెమిస్ట్రీ లెక్చరర్లు తమకున్న ప్రయోగాల క్లాసుల్ని వదిలేసి , రెండున్నరకే కామన్‌రూమ్‌లోకి వచ్చి కూర్చున్నారు. ఇంచుమించు అన్ని కుర్చీలూ నిండిపోయి ఉన్నాయి. కుర్చీలో కూర్చుంటూనే రాగ వరుసలో పాట అందుకున్నాడు. కెమిస్ట్రీ మోమన్;

"తీస్కో, కోకా కోలా
లల్లా లల్లల్లా,
ఏస్కో, రమ్ము సోడా,
టిట్టిం, టిట్టిట్టిం
వచ్చే, కృష్ణారావూ
తెచ్చే, మెమోరాండం.."

పాట ఆపేసి ప్యూను కృష్ణారావు తెచ్చిన నోటీసు నందుకుని మంత్రం చదివినట్లుగా పైకి చదివాడు

మోహన్: "ఆల్ ది లెక్చరర్స్ ఆర్ రిక్వెస్టెడ్ టు రైట్ ది టీచింగ్ డైరీ ఎట్సెట్సెట్సెట్సెట్రా అఆఅ" పుస్తకం బుక్కు టేబుల్ మీద పడేసి అన్నాడు:

"నిన్ననే నేను నోట్సు రాసి తీసుకెళ్ళాను. గురూ! పుస్తకం ఏదీ దొరక్క నైన్‌టీన్ సెవెంటిసిక్స్ బ్రాంది కంపెనీ డైరి మీద రాసుకెళ్ళాను. ప్రధమ గురుడు నా డైరీని తిప్పి తిప్పి చూసి, "ఈ పుస్తక మేమిటి?" అని అడిగాడు. నాకు రియాక్షన్ వచ్చేసిందనుకో అడ్డంగా డబాయించేశాను. గురుడు డంగై పోయాడు. కానీ.... ఎప్పటికైనా రాయక తప్పదనుకుంటాను ఏమంటావురా, బీస్ట్ బ్రదర్?"

"ఏమిట్రా రాసేది ! ఇదో వెధవ ముండా ఉద్యోగం కాబట్టి ఇట్లా చస్తున్నాం. డబ్బులు చూడబోతే ముష్టి వెయ్యిరూపాయలు. చాకిరీ మాత్రం బండచాకిరి. ఇంతకన్నా కన్నాపురం ఫారెస్ట్‌లో డిప్యూటి రేంజరు ఉద్యోగం నయం ఏం గురూ?"

"గార్డు- గార్డు ఉద్యోగం బెటరు గురూ" అన్నడు నాగచంద్రం.

"ఫార్ బెటర్" బ. రా. కలిసాడు.

"ది బెస్ట్ గురూ! సందేహం లేదు" అన్నాడు మోహన్.

కామర్సు లెక్చరరు మధ్యలో కల్పించుకుని అన్నాడు. "అంత ఇష్టం లేనప్పుడు ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చారండీ?"

"ఇంకెక్కడా మాకు ఉద్యోగాలు దొరకలేదు గదా మరి" అన్నాడు భాస్కరరావు.

కాలి: ఇహానేం మీ అవసరం కొద్ది వచ్చి ఉద్యోగాన్ని తిట్టటం దేనికి? ఇంతకీ డబ్బులు తక్కువయినంత మాత్రాన వృత్తి చెడ్డదవుతుందా?.. రష్యా, చైనా, అమెరికా లాంటి దేశాలు పైకి వచ్చాయంటే అక్కడి ఉపాధ్యాయులు వల్లనే కదా!

పున్నయ్య : బాబూ! ఎడా పెడా వాయించెయ్యకండి మమ్మల్నిలా బతకనివ్వండి.

కాలి: ఇంతకూ ప్రిన్సిపాల్‌గారు మనల్ని అడిగిందల్లా క్లాసులోకి పోయి అప్పటికప్పుడు నోటికొచ్చిందేదో చెప్పేయడం కాకుండా చెప్పబోయే దాన్ని బాగా చెప్పటానికి వీలుగా క్లుప్తంగా ముందుగానే రాసి వుంచుకోమని కదా !ఈ మాత్రానికే బాధపడిపోతే ఎట్లా?

పున్నయ్య: మీరు ఆపాలి; లేదా వెళ్ళిపోవాలి.

మోహన్ : స్టాపిట్ ఆర్ గో అవుట్?

కామర్సు లెక్చరరు స్తబ్దుడయ్యాడు.

ఉండి ఉండి ఎకనామిక్సు లెక్చరరు డేవిడ్ అన్నాడు. "మూడవ్వస్తూంది రాజమండ్రి బస్సుకు మిస్ చెయ్యకుండా పోదాం పదండి మరి".

మోహన్ : నేను నిన్న అడిగా ఇవాళ నువ్వెళ్ళి పర్మిషన్ అడుగు

పున్నయ్య: ఎంతమందికని అడగను?

మోహన్: ఇవాళ నీకు నాకు అని అడుగు

పున్నయ్య: ప్రిన్సిపాల్ రూమ్‌కి వెళ్ళి వచ్చాడు నలుగురు సైన్సు లెక్చరర్లు ఇంకో ముగ్గురుని

కలుపుకుని బయటికి నడిచారు. కంచె దాటి అడ్డదారి వెంట వెళ్ళి గోదారి గట్టెక్కి కనుమరుగై పోయారు.

ఇక్కడ కామన్ రూమ్‌లో తన పక్కన కూర్చుని ఉన్న ప్రహ్లాదవరదాచారితో కామర్స్ లెక్చరర్ - ''మన వాళ్ళు క్లాసులు ఎగ్గొట్టి ఇట్లా షికారు కొట్టడం బాగుండలేదు. తమ పిల్లలు పైకి రావాలని కదా ఊళ్ళో వాళ్ళు కాలేజీ పెట్టించాలనుకున్నారు. పెట్టిన మొదటి యేడే పిల్లలకు ఏమీ అబ్బకపోతే పేరెంట్స్ బాధ పడరా?'' అన్నాడు.

''అయితే నన్నేమి చెయ్యమంటారు?''

''మీరు వయోవృద్ధులు జ్ఞానవృద్ధులు కూడా. మనవాళ్ళకు కొంచెం చెప్పకూడదు?''

ప్రహ్లాదవరదాచారి కళ్ళల్లోకి ఎర్రజీరలు వచ్చాయి కళ్ళజోడు తీసి రుమాలుతో తుడుచుకుంటూ, ''వై షుడ్ ఐ?'' అన్నాడు. విసురుగా లేచి బయటకు నడిచాడు.

కామర్స్ లెక్చరరు రెండోసారి అవాక్కయ్యాడు.

★ ★ ★

నాలుగు రోజులు తరువాత కామన్‌రూమ్‌లో యు.జి.సి స్కేళ్ళు, వాటిని అందుకోటానికి యమ్.ఫిల్ డిగ్రీ ఆవశ్యకత వగైరా విషయాల మీదే సంభాషణ నడుస్తుంది.

''యమ్.ఫిల్ డిగ్రీ ఉంటేనే గాని కొత్త స్కేలు ఇవ్వబోమని అనటం అన్యాయం గురూ! మన విజ్ఞానాన్ని కాచివడబోస్తేనేకదా గురూ, మనకు మాస్టర్ డిగ్రీలిచ్చారు యూనివర్శిటీ వాళ్ళు! మళ్ళీ ఇదొకటా... అసలు మా ఫిజిక్సు బేచ్‌లో నేను జీనియస్‌ని. కాస్టుఫీలింగు పెట్టుకుని మా ప్రొఫెసరు సెకండు క్లాసు ఇచ్చాడు కాని, లేకపోతే నాకు ఫస్టురావలిసింది...'' అన్నాడు భాస్కరరావు.

''నాకు అంతే గురూ క్యాస్టు అడ్డం వచ్చింది. అక్కడికీ ఆయన కుంటికూతురుని లవ్వాడాను. అయినా మా ప్రొఫెసరు నాకు జస్ట్ అరవై పర్సంట్ ఇచ్చాడు. లేకపోతే ఆరుతిరగబడి తొంభై పర్సంట్ ఇవ్వవలసింది. అప్పుడు నేను రీసర్చ్ చేస్తుండేవాడ్ని'' జతకలిపాడు పున్నయ్య.

మోహన్: అక్కడినుంచి ఏ ట్రాంబేంకో పోయుండేవాడివే.

పున్నయ్య: అక్కడినుంచి అమెరికాకు పోయేవాడిని.

మోహన్: అక్కడినుంచి చంద్రమండలానికి పోయేవాడివా.

పున్నయ్య : అక్కడినుంచి ఇంకాపైకి ఆకాశంలోకి ఎక్కడికో పోయేవాడిని.

మోహన్ : పీడ వదిలేది నిన్ను తగలెయ్య.పోనుఅయినా పోయావుకాదురా బీస్టు...లేకపోతే మమ్మల్ని వదిలేసి ఎక్కడికో పోతాట్ట!

పున్నయ్య : అబ్బాయ్! నువ్వెంత ఏడ్చినా ముగ్గుర్లోను నువ్వు కలవవు

మోహన్. గురూ, నన్ను విడదియ్యకండి గురూ మనసైన్సువాళ్ళం నలుగురుం ఒకటే, గురూ. మనలో మనకి డిఫరెన్సు ఏమిటి గురూ?

ఇంటర్మీడియెట్ స్టూడెంటు ఒకమ్మాయి శుభలేఖల కట్ట పట్టుకొని బెరుకు బెరుకుగా లోపలికి వచ్చింది ! ''నా పెళ్ళండి'' అంటూ అక్కడున్న లెక్చరర్లందరికి తలొకటి ఇచ్చింది.

"పెళ్ళికొడుకు మీకు చుట్టమా", అడిగాడు పున్నయ్య. అమ్మాయి సిగ్గు పడుతూ, తలొంచుకుని 'కాదండి' అంది. "అయితే తొందరగానే తెంపుకోవచ్చు" జోకు విసిరాడు.

అమ్మాయి అర్థం కాక-"ఏమిటండీ"? అంది. "అబ్బే, తొందరగానే విడాకులు పుచ్చుకోవచ్చు అంటున్నాను. అంతే!" అని విడమర్చి చెప్పాడు పున్నయ్య పంతులు.

ఆ అమ్మాయి మొదట బిత్తరపోయి చూసింది. తరువాత క్రమంగా మొహం పాలిపోగా గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయింది. 'పున్నయ్య గారు! మీ ప్రొఫెసరుకున్న క్యాస్టుఫీలింగువల్ల మీరు పెళ్ళితప్పనుకుంటూ కూడా అదే వాతావరణాన్ని మీరుఇక్కడ ప్రోత్సహించడం ఏం న్యాయం చెప్పండి? కనీసం మన యువతరం అయినా ఈ ఫీలింగుని పోగొట్టుకోలేకపోతే దేశంలో ప్రగతిని అసలు చూడగలమా?" అన్నాడు కా.లె. పున్నయ్య కోపంగా చూశాడు. వెంట వెంటనే మిగిలిన సైన్సు లెక్చరర్లు కూడా తినేసే చూపుతో కామర్సు లెక్చరరుని చూశాడు.

★ ★ ★

అక్టోబరు నెలలో హిందీ పోస్టులోకి విశాలాక్షి అనే పెళ్ళికాని అమ్మాయి బదిలీమీద అసిస్టెంటు లెక్చరరుగా వచ్చిచేరింది. మనిషి చక్కనిది, పొడుగాటి దీను. ఆ అమ్మాయి చొరవ అంతా మొహంలోనే కనబడుతుంది.

వారం తరువాత ఒకరోజు కామన్‌రూమ్‌లో అందరూ ఉండగా తమ బాధను చెప్పుకుంది విశాలాక్షి. "నా నాలుగేళ్ళ సర్వీసులోను ఇది నాలుగో ఊరండి- మూడు ఇంక్రిమెంట్లు రావాలి. ప్రతి ప్రిన్సిపాల్ ఏదో అడ్డంకి చూపడం వల్ల ఒక్కటీ సేంక్షన్‌కాలేదు. చూడబోతే ఇక్కడి ప్రిన్సిపాల్ గారు కూడా శాంక్షన్ చేసేటట్టు లేరు. బాధ్యత ఉన్నదాన్ని. డబ్బుకు ఇబ్బందిగా ఉంది. కాస్తమీరెవరైనా నా తరఫున ఆయనతో చెప్పకూడదూ?"

కాళ్ళు టేబుల్ మీద పెట్టుకుని కూర్చున్న వాడల్లా చటుక్కున నిటారుగా కూర్చుని "మీకు తేల్చుకోవాలంటే తలాకాస్త సాయం చేస్తాం. ఇంక్రిమెంట్లు విషయం తరువాత చూసుకోవచ్చు లేండి" అన్నాడు పున్నయ్య. "సంతోషం కాని ఎప్పటికైనా నావంతు నాకు రావాలిగా. ఆ ప్రయత్నం మీరెవరైనా చేసినా ఎరియర్స్ నాకిప్పిస్తే కృతజ్ఞురాలిని" అంది విశాలాక్షి.

పున్నయ్య నాగచంద్రం వైపు నాగచంద్రం భాస్కరరావువైపు, భాస్కరరావు మోహన్ వైపు, మోహన్ ఏమో ప్రహ్లాదవరదాచారివైపు చూశాడు.

"ఇక్కడ ఎవడి బాధ వాడు పడటమే ఆచారమండి " అన్నాడు పున్నయ్య." అంతే అంతే" వంత పలికాడు నాగచంద్రం . విశాలాక్షి ప్రహ్లాద వరదాచారి వైపు తిరిగి - " మీరు వైస్ ప్రిన్సిపాల్ కదా, మాష్టారూ? మీతో పాటు వస్తాను. - ఆయన దగ్గరకు రాకూడదూ? ఒంటిగా వెళ్లాలంటే బెరుగ్గా ఉంది " అన్నది " అబ్బే మేము రాకూడదండీ! ఇదేదో ట్రేడ్ యూనియన్ అఫైర్ లాగా ఉంటుంది. ఆయన అఫెండ్ అవ్వవచ్చు " విశాలాక్షి మొహంలో విచారం తొంగి చూపింది. కామర్స్ లెక్చరర్ నెమ్మదిగా కుర్చీలోంచి లేచి " నేను వస్తా పదండి , విశాలాక్షి గారూ" అన్నాడు ఇద్దరూ బయటకు నడిచారు. టేబులమీది నుంచి కాళ్ళు పడేస్తూ అక్కసుగా, " అల్లాంటి పోరేరంగాళ్ళుండబట్టే కదూ వీళ్ళు, పరిస్థితులిట్లా ఉన్నాయి? " అన్నాడు మోహన్

" అవును , యూనిటీ ధ్వంసమై పోతోంది " కలిసాడు పున్నయ్య భాస్కరరావు కోపంగా " అసలు వీడో పాలిటీషియన్ గురూ, నక్సలైటో, ఆరెస్సెస్సో అయ్యుండాలి. సాక్ష్యం పుట్టించి ఎస్ ఐ కి అప్పగిద్దామా? అన్నాడు. నాగచంద్రం తాపీగా- " కోపం వచ్చెయ్యదు, గురూ! ఇట్లాంటి వాళ్లని సమయం చూసి దజ్జులో పడెయ్యాటవే " అన్నాడు.

కాంపోజిషన్లు దిద్దుకుంటున్న ఇంగ్లీషు లెక్చరరు తలెత్తి వీళ్ల భాష అర్థం కానట్లు అయోమయంగా ఒకసారి చూసి మళ్ళీ తన పనిలో నిమగ్నమయ్యాడు. మోహన్ - ' రూలు పొజిషను తెలిసిన మన ' 'పెద్దమనిషి' గారుండబట్టిగాని, లేకపోతే ఈ పాటికి మన మేమైపోయుందుము? అన్నాడు ప్రహ్లాద వరదాచారి తన నీలం టెరిలిన్ చొక్కా జేబులోంచి వంద రూపాయల నోట్లు అయిదు తీసి లెక్క పెట్టుకొని, జాగ్రత్తగా మళ్ళీ జేబులో పెట్టుకునానడు. తన బట్టతల వోమాటు తడుముకుని లేచి నుంచున్నాడు. ముసిముసిగా నవ్వుతూ లేచి వచ్చి మోహన్ నెత్తి మీద మెచ్చుకోలుగా ఒక జెల్ల కాయవేసి" పారంలోనే కాదు, మాటల్లో కూడా ఎంతైనా మావాడు మావాడే" అంటూ బయటకు నడిచాడు. మిగిలిన ముగ్గురు సైన్సు లెక్చరర్లు మొహామొహాలు చూసుకున్నారు.!

★ ★ ★

కామర్స్‌లో రెండో పోస్టు శాంక్షన్ అయింది. అందులో ఒక అసిస్టెంటు లెక్చరరును బదిలీ మీద వేశారు. అతను వచ్చిజాయిన్అయ్యాడు. మొదటి కామర్స్ లెక్చరర్ పేరు కర్మసాక్షి. ఈ కొత్తవాడి పేరు రెహమాన్.

★ ★ ★

కెమిస్ట్రీ మోహనూ, ఫిజిక్సు భాస్కరరావూ ఉన్నారు కామన్ రూములో దూరంనుంచి ఒక అమ్మాయి వస్తూంది రూమువైపుకు. భాస్కరరావు అన్నాడు. " చూడు , గురూ! అ పిల్ల నడుస్తూంటే జాకెట్ ఎట్లా కదులు తూందో! క్లాసులో ఆ పిల్లుంటే ఆ ఒళ్ళు చూస్తూ ఎన్ని గంటలైనా అట్లా లెక్చరిచ్చేస్తుండాలనిపిస్తుంది నాకు." ఆ పిల్ల గుమ్మంలోకొచ్చి, " మే ఐ కమిన్, సర్? అంది. " రా, ఏం కావాలి?" ఆడపిల్ల దగ్గిరకు వచ్చింది . " మీరు మాకు చెప్పని లెక్కను మొన్న టెస్టులో నేను చేశానండి. మీరు మార్కులు వెయ్యలేదండి." ... " చెప్పని లెక్కను ఎందుకు చేశావు? అందుకనే దిద్దలేదు." .. "తక్కువ టైమ్‌లో అయిపోయిందని చేశానండి. అయినా చెప్పనివి ఇవ్వకూడదు కదండి.." .. " అని ఎక్కడుంది? .. నాలెడ్జి -జనరల్ నాలెడ్జి టెస్ట్ చెయ్యటం కోసం ఏ మూలనుంచో హఠాత్తుగా ప్రశ్న లిచ్చేస్తూంటాం. అవి మీరెట్లాగూ రాయలేరు గనక మేమసలు దిద్దం."... " ఇదేం న్యాయమండి! మీరు చెప్పిన ప్రశ్నలే మా కిస్తే మీ రెట్లా చెప్పారో మాకెట్లా అర్థమయిందో మా జవాబుల ద్వారా మీరు తెలుసుకోవచ్చును కదండి!.. అసలయినా ఇంకో విషయం కూడా ఉందండి. మాకు మీరు ఫిజిక్సు చెప్పటం మొదలు పెట్టి నప్పటినించీ అన్నీ పారాలూ గైడ్లలోలాగా ప్రశ్నలు - జవాబులూ పద్ధతిలో చెబుతున్నారు. అట్లా కాకుండా పుస్తకంలో ఉన్నదున్నట్లుగా చెప్పకుపోవచ్చును గదండీ!" ... " చిన్నపిల్లవు- నీకేం తెలుసు? రేపు మెడిసిన్‌లో జాయిన్ అయ్యాక తెలుస్తుంది. - నీకు, ఈ పద్ధతి ఎంత గొప్పదో నేను ఎంత గొప్పవాడినో."

ఆ అమ్మాయి మొహం చిన్నబుచ్చుకుని - " ఈ బైపిసి తో ఈ ఇంటర్ పాసయితే చాలండి.

మా మొహాలకు మెడిసిన్ కూడానా?'' అంటూ వెళ్ళిపోయింది. '' తస్సాదియ్యా, ఎంత గీర గురూ'' అన్నాడు భాస్కరరావు. గంట కొట్టారు. మిగిలిన ఇద్దరు సైన్సు లెక్చరర్లు రూములో కొచ్చి బూట్లకాళ్లు టేబిల్ మీద పెట్టి, కుర్చీలో వాలిపోయారు. భాస్కరరావు అన్నాడు. '' అడుగో ఒకటో కృష్ణుడు వస్తున్నాడు.'' అందరూ ద్వారం వైపు చూశారు. కర్మసాక్షి లోపలికి వచ్చాడు. '' ఏం బాబూ! గంటనుంచీ ప్రిన్సిపల్ తో భేటియేనా! ఏమిటి చర్చాంశం ?'' అడిగాడు భా.రా. నాగచంద్ర తాపీగా -'' ఆఁ ఏదోలూబ్రికేషన య్యుంటుందిలే, గురూ'' అన్నాడు కర్మసాక్షి మొహంలో బాధ వ్యక్తమయింది. '' లూబ్రికేషన్‌ల మీద బతికేందుకు నేను సబ్జక్టు రాని వాణ్ణి కాదు. వర్కు ఎగ్గొట్టేవాణ్ణికాదు. '' అంటూ గిరుక్కున వెనక్కు తిరిగి బయటకు వెళ్లిపోయాడు. '' చూసాడా, గురూ, ఎంత మాట అన్నాడో? అక్కడికి వీడే సిన్సియరు మోస్టయినట్లు! వీడికి బి పి తగ్గించాలి. గురూ! లేకపోతే బతకలేం'' అన్నాడు మోహన్.

నాగచంద్రం తాపీగా సిగరెట్టుపొగ వదులుతూ... '' పెద్దగురుడు మనవాడయ్యుండి కూడా మనమేం చెయ్యలేకపోతున్నామంటే ఇన్సల్ట్... అయినా ఒక పద్దతుందనకో... అదే, అట్నుంచి నరుక్కురావటం! - పెద్ద గురుడి మీదనే విభూతి చల్లేసి, బుద్ధిశుద్ధి చేసెయ్యటం'' అన్నాడు.

భాస్కరరావు అడిగాడు '' అంత తేలిగ్గా మనకు లొంగుతాడంటావా?'' ... '' లొంగక? డబ్బా, మజాకా? డిస్కౌంట్సు, గురూ , డిస్కౌంట్సు! మీరజాలగలడా మా యానతి, డిస్కౌంట్సు మహిమన్, విద్యాపతి మీరజాలగలడా... ఆఁఆఁఆఁ'' బాస్కరరరావు అన్నాడు: '' పదేసి రూపాయలు చొప్పున రికార్డులమ్మాం కదా, దాంట్లో పెద్ద గురుడి వాటా ఎంత?'' .. '' నీ మొహం కాటికెళ్ళా, అది పూర్తిగా మన కష్టార్జితంరా, నాయనా! అంతే కాదు వచ్చే ఏడాది పదిహేను చొప్పున అమ్మినా పైన అయన కివ్వక్కరలేదు.'' ... '' అన్నట్లు నిన్ననువ్వు కెమికల్స్ ఇండెంటు పెట్టినట్టున్నావు, సారాభాయీ, బి.డి. హెచ్ లకనా అయ్యో ఎంత వెర్రి వాడవు నాయనా! సారభాయి బి.డి.హచ్. కంపెనీలు డిస్కౌంట్సు ఇవ్వరు, నాయనా!'' ప్యూన్ కృష్ణారావు లోపలికొచ్చి, స్టాఫ్ మీటింగు ఉందనీ, ప్రిన్సిపాల్ అందర్నీ రమ్మంటున్నాడనీ చెప్పి వెళ్ళి పోయాడు. తరువాతి పావుగంటలో ప్రిన్సిపాల్‌తో కలిసి అందరూ ఖాళీగదిలో సమావేశ మయ్యారు. ప్రిన్సిపాల్ అన్నాడు : ''పై ఏడాది రిజల్ట్సు బాగుండాలంటే మనం ఇప్పట్నుంచీ కృషి చెయ్యాలి. మీకు తెలిసిన మార్గాలేమిటో చెప్పండి.'' అందరికన్నా పెద్దవాడూ, వైస్ ప్రిన్సిపాలూ అయిన ప్రహ్లాద వరదాచారి నుంచున్నాడు ''మాష్టారూ! ఇక్కడ కాలేజీపెట్టారు కనక ఉబుసుపోక కొండల్లోనుంచీ, లంకల్లోనుంచీ కుర్రాళ్ళొచ్చి చేరారు కాని, నిజంగా వీళ్ళు చదువుకోవాల్సి రాలేదని నా అభిప్రాయం. పైగా జాయిన్ చేసుకునేటప్పుడు సెలెక్షన్ అంటూ ఏమీ జరగలేదు కదా. కనక ఈ జనాన్నందర్నీ ఉద్ధరించాలని మనం కంకణం కట్టుకోవటం అత్యాశ అవుతుంది. మేము ఏదో చెప్పేస్తున్నాం కదా. ఇట్లాగే జరిగి పోనివ్వండి. ఇంతకన్నా చేయవలసిన కృషి ఏమీ లేదు'' అని కూర్చున్నాడు.

ఇతను మాట్లాడుతూన్నప్పుడు సైన్సు లెక్చరర్లు వాళ్ళల్లో వాళ్ళు బెంచీలమీద వోమూలగా తిరిగి బిగ్గరగా మాట్లాడుకుంటున్నారు. ప్రహ్లాద వరదాచారి కూర్చోగానే వీళ్ళల్లో నుంచి ఇద్దరు నుంచొని ఒకేసారి మాట్లాడటం మొదలెట్టారు. ఆచారి లేచి వెనక్కు నాలుగో బెంచీలొకి వెళ్ళి ఇంగ్లీషు లెక్చరర్‌తో ఏదో విషయం మీద బిగ్గరగా చర్చ లేవనెత్తాడు. సమావేశం మొదలైన అయిదు నిమిషాలకు ఎవరు ఏం చెబుతున్నారో అర్థంకానంత అయోమయంగా వాతావరణం తయారయింది. ప్రిన్సిపల్ అవాక్కయి చూస్తున్నాడు. బహుశా ఈ పరిస్థితి అతనికి కొత్త అయి ఉండవచ్చు. ఆ కారణాన అతను ఆలోచనా

రహితుడై ఉండవచ్చు. ఇంకొక అయిదు నిమిషాలు గడిచాయి. ''మాష్టారూ!'' - ఖంగుమని వినిపించిన కంఠం విని లెక్చరర్లు అందరూ వెనక్కు తిరిగి చూశారు. కర్మసాక్షి మాట్లాడుతున్నాడు :

''నాకు తోచిన సూచనలు చేస్తున్నాను. దయతో ఆలోచించగలరు. మొదటిది - లాంగ్వేజెస్, లెక్కలు, కామర్స్ క్లాసుల్లో ఏ స్టూడెంటూ టెక్స్ట్ బుక్ లేకుండా కూర్చోకూడదు. రెండవది, పాఠం చెబుతున్నప్పుడు ప్రతి విద్యార్థి నోట్సు తీసుకుంటూండాలి. మూడవది-లెక్చరర్లు వారానికి రెండుసార్లు ఎసైన్‌మెంటు (ఇంటిపని) ఇవ్వాలి. నాలుగవది-వారానికి ఒక ట్యుటోరియల్ క్లాసు తీసుకుని అందులో కుర్రాళ్ళ చేతనే ప్రశ్నలు - జవాబులు నడిపించాలి. అవసరమైన చోట్ల లెక్చరర్ కల్పించుకోవాలి. ఐదవది- పిల్లలకూ, ప్రజలకూ, ప్రభుత్వానికీ ఎక్కువమంది పాసవ్వటమే లక్ష్యం కనక, పాత యూనివర్సిటీ పేపర్ల ఆధారాంగా కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను పోగుచేసి, 'క్వశ్చన్‌బాంకు'ను ఏర్పాటుచేసి, ఆ క్వశ్చన్సును అధ్యాయం వారీగా కుర్రాళ్ళకిచ్చి, వాటిల్లో నుంచే ఏరి వాళ్ళకు టెస్టుల్లో ప్రశ్నలివ్వాలి. ఆరవది - నెలకు రెండు టెస్టులు పెట్టాలి. ఏడవది-పేపర్లు దిద్ది ఇచ్చేసి ఊరుకోకుండా వెంటనే కుర్రాళ్ళ రాతలో లోపాలను వాళ్ళ దృష్టికి తీసుకురావాలి. - ఇవన్నీ తప్పక కనీసంగా జరుగవలసినవి. ఇట్లా ప్రతి సబ్జెక్టులోనూ జరగాలని నా కోరిక. ఆపైన మీ ఇష్టం.''

కర్మసాక్షి కూర్చోగానే పున్నయ్య విసురుగా నుంచున్నాడు. రెండు చేతులతోనూ పాంటు గుండీలను ఒకమాటు తడుముకున్నాడు. చేతులు ఇంకా అక్కడే తచ్చాడుతూండగా అన్నాడు : ''మా సైన్సుల్లో ఇల్లాంటి వేమీ కుదరవండి. ఒక్కోటాపిక్ రెండేసి వారాలు పడుతుంది. ఎసైన్‌మెంటు ఎందులో ఇస్తాం? పోతే, పరీక్షల ముందర ఎట్లాగూ రివిజన్ చేస్తాంగదా? ఇంకా క్వెశ్చన్ బాంకులు, ఆన్సర్ బాంకులు ఎందుకండి?...... మీ అభిప్రాయం కూడా చెప్పండి'' ఇట్లా అంటూ మిగిలిన ముగ్గురు సైన్సు వాళ్ళవైపూ చూసి కాలరు ఎగరేసుకుంటూ కూర్చున్నాడు.

వాళ్ళు కూర్చునే, ''అవ్వేం అక్కర్లేదు. ఏదో ఇట్లా పోనిచ్చేయండి'' అన్న భావం వచ్చే మాటలను ఒక్కసారిగా గోలగోలగా మాట్లాడారు. ప్రిన్సిపాల్ బిత్తరపోయాడు. ఏమీ తేలకుండానే మీటింగు అయిపోయింది. విజయగర్వం సైన్సు లెక్చరర్ల మొహాల్లో తాండవించిది.

★ ★ ★

అది పల్లెటూరే అయినా విద్యార్థులపై పట్టణ వాతావరణ ప్రభావం కూడా ఉంది. రెండు హైదరాబాద్ బస్సులు ఊరిమీదుగా వెడతాయి. ఈ కారణాలవల్ల అక్కడి యువకులు మెత్తనివాళ్ళే అయినా, అనాగరికులేమీ కాదు. కొన్ని కాలేజీలతో పోల్చినప్పుడు ఇక్కడ ఆడ-మగపిల్లల సమస్యలు అసలు లేవనే చెప్పాలి. అయితే, ఆ ఖాళీని భర్తీ చేశాడు. జువాలజీ లెక్చరర్ పున్నయ్య.

ప్రాక్టికల్ రికార్డు మార్కులు కోసేస్తాడేమోనన్న భయంతో సగంమంది ఇంటర్ బై.పి.సి స్టూడెంట్లు పున్నయ్య దగ్గర ట్యూషన్‌కు కుదిరారు. ఒకరోజున ఒక ఆడపిల్ల ట్యూషన్ క్లాసుకు రాలేదు. పున్నయ్య ఒకడితో, ''నువ్వెళ్ళి ఆ అమ్మాయి ఎందుకు రాలేదో కనుక్కురారా'' అని పంపాడు. వాడు వక్కిలంక వెళ్ళి పావుగంటలో తిరిగొచ్చి అన్నాడు . ఆ అమ్మాయి నీళ్ళు పోసుకుంటోందండి.''.. ''ఇవ్వాళ్ళే నీళ్ళా?''.. ''తెలీదండి.'' ''నీళ్ళు పోసుకుంటూందని నీకెట్లా తెలుసు?''... ''బాత్‌రూము పైకి చెయ్యి కనిపించిందండి''.. ''తలుపుకింద నుంచి చూశావా, సందునుంచి చూశావా?''... ''అస్సలు దగ్గరికి

కెళ్ళలేదంటి.''... ''పోరి నీ శ్రాద్ధం పెట్టా, అన్నీ వివరంగా చూడొద్దురా! మా రోజుల్లో మేమయితేనా....''

ఆ సాయంకాలానికి ఈ సంభాషణ అంతా ఆ పిల్ల తండ్రికి తెలిసి అతను నలుగురు పాలేళ్ళను వెంటబెట్టుకుని పున్నయ్య ఇంటిమీదికి వచ్చారు. తిరుమలాపతీ, మిగత ముగ్గురు సైన్సు లెక్చరర్లూ వాళ్ళ అందుకుని వచ్చి పున్నయ్య చేత క్షమాపణ చెప్పించి అప్పటికి సర్దేశారు.

పదిరోజుల తరవాత ఒక మధ్యాహ్నం కాలేజీ కామన్ రూములో బూటుకాళ్ళు బల్లమీద పెట్టి వంగజాపి కూర్చుని కుర్చీని వెనక గోడకు గెంటుతున్నాడు పున్నయ్య, అంగుళం పొడవున పాంటు చినిగి, ఒళ్ళు బయటకు తోసుకొచ్చింది. పున్నయ్య సిగరేట్ పీలుస్తూ రింగులు వదుల్తూండగా అతని క్లాసు పిల్లలు ఎదురుగుండా జువాలజీ ప్రాక్టికల్ చేస్తున్నారు. ప్రక్క కుర్చీలో కూర్చోనున్న మోహన్ తాళం చెవుల గుత్తిని పైకి ఎగురవేసి పట్టుకుంటూ అన్నాడు. "గురూ, గురూ ! గంగ మహల్లోకి 'పగసాధిస్తా' వచ్చింది - చూశావా?''.... "చూళ్ళేదు.''... "అబ్బ, ఆ జలపాతం సీనుంది, గురూ! యూ మస్ట్ సీ ఇట్.''.

ఈ సంభాషణే వింటూందో, పొగరింగులే చూస్తూందో, పున్నయ్యనే పరిశీలిస్తుందో తెలీదు కాని, ప్రయోగాలు చేస్తున్న ఒక పిల్ల నోట్లో పెన్ను పెట్టుకుని తదేకంగా వీళ్ళవైపే చూస్తుంది. టక్కున పుల్ల విరిచినట్టు పున్నయ్య అన్నాడు : "ఏం చూస్తున్నావే, పిల్లా? పెళ్ళయ్యాక మీ ఆయన్తో కలిసి రేపు నువ్వూ రింగు రొదలొచ్చులే. ముందు ఎక్స్‌పెరిమెంటు చూడు'' అని, మోహన్ వైపు తిరిగి - "ఎట్లాగైనా వీళ్ళకి హుషారెక్కువ'' అన్నాడు.

ఆ సాయంత్రం ఆరుగురు మనుషులతో ఆ పిల్ల తండ్రి వచ్చాడు పున్నయ్య ఇంటిమీదికి. ఈసారి, పూర్వపు వాళ్ళేకాక, ప్రహ్లాద వరదాచారి, కర్మసాక్షి కూడా వెళ్ళి క్షమాపణ చెప్పుకుంటేనే గాని అతను పున్నయ్యను వదల్లేదు. ఇంకోరోజు, ఇంచుమించు అందరు లెక్చరర్లూ కామన్‌రూములో ఉన్న సమయంలో పున్నయ్య హిందీ లెక్చరర్ విశాలాక్షిని అడిగాడు : "ఏమండీ! మీరు ఫస్ట్ క్లాస్‌లు గదా, పరీక్షల ముందర ప్రొఫెసర్ గారింటిగ్గాని వెళ్ళారా?''.... విశాలాక్షి పది, పన్నెండు క్షణాలు ఆలోచించింది. చివరికి విలాసం ఒలకబోస్తూ : - "సాయంత్రం ఏడింటికి నా రూముకు రండి, పున్నయ్యగారూ, కులాసాగా మాట్లాడుకుందాం'' అని లేచి బయటకు వెళ్ళిపోయింది. పున్నయ్య విజయ సూచకంగా తన కాలరు ఎగరవేశాడు. మిగిలిన ముగ్గురూ అతనివైపు ఈర్ష్యా పూర్వకంగా చూశారు. ఆ నాలుగు మెదళ్ళూ కళ్ళద్వారా కొత్త సంభాషణలను పరస్పరం అందించుకున్నాయి.

ఆ సాయంత్రం పున్నయ్యను సాదరంగా లోపలికి ఆహ్వానించి తలుపు గడియపెట్టింది విశాలాక్షి. అతను దగ్గిరకు రాబోగా, చీపురు తీసి ఎడా పెడా క్షణం కూడా విరామం లేకుండా చితకబాది వదిలిపెట్టింది. "ఈ జరిగిన కథ ఎక్కడైనా చెప్పావో, పదిమందిలో ఉన్నాసరే నీ మీద పడి, గొంతు పిసికి చంపేస్తా - జాగ్రత్త, వెధవా!'' అంటూ తలుపు తీసి అతన్ని బయటికి ఒక్క తోపు తోసింది. ఈ విషయం ఆ నోటా ఆ నోటా అందరికీ తెలిసిపోయింది. కుర్రాళ్ళలో అలజడి మొదలైంది. వారంరోజులు కాలేజీకి సెలవు పెట్టాడు పున్నయ్య

★ ★ ★

ఫిబ్రవరి నెల వచ్చింది. "కర్మసాక్షిగారి సహాయంతో స్టాకు వెరిఫికేషన్ చేసి రిపోర్టులు సిద్ధం చెయ్యండి'' అని ప్రిన్సిపాల్ సైన్సు లెక్చరర్లందరికీ నోటీసులు పంపాడు. ఆ సమయానికి కామన్ రూములో

సైన్సువాళ్ళూ, ప్రహ్లాద వరదాచారీ, తిరుమలాపతీ కూర్చొని మాట్లాడుకుంటున్నారు "స్టాకు వెరిఫికేషన్‌కు మధ్యలో ఈ పేరేరంగాడెందుకు, గురూ? మనలో మనం చేసుకోలేమా!" అన్నాడు మోహన్. "అమ్మో, వీడు ఎపెండిక్స్‌లాంటి వాడు చేసిచచ్చే ఉపకారం లేకపోయినా దగ్గరకు రానిస్తే మాత్రం మన పుట్టెంట్రుకలు ఏరేస్తాడు... అన్నట్టు నా లాబ్‌లో ఆరు చార్టులూ, నాలుగు స్పెసిమన్సూ మిస్సింగు" అన్నాడు పున్నయ్య. "నా స్పెక్ట్రామీటర్‌లో టెలిస్కోపు విరిగిపోయింది. ఒక బాలన్సు మిస్సింగు. మెర్క్యురీస్టాకు నిల్లూ" అన్నాడు భా.రా. నాగచంద్రం తాపీగా సిగరెట్టు రింగులు వదిలి "అఫ్‌కోర్స్, నాకూ ఒక మైక్రోస్కోపు మిస్సింగనుకో." అన్నాడు. తిరుమలాపతి కల్పించుకుని "అవ్వన్నీ ఇళ్ళ దగ్గిర ట్యూషన్ క్లాసు ఉద్ధరిస్తున్నాయేమో!" అన్నాడు. ప్రహ్లాద వరదాచారి అన్నాడు - "మీ కెందుకండీ మధ్యన, వాళ్ళ బాధేదో వాళ్ళు పడుతున్నారుగా!"

"ఇదుగో పంతులూ! నువ్వు మా పక్షాన ఉన్నావా బతుకుతావ్. లేకపోతే డబ్బు కక్కలేక చస్తావు!" బెదిరించాడు పున్నయ్య. "ఇప్పుడు బతికానా? మొన్న వెయ్యి రూపాయల చీటీలో నా చేత హైయస్ట్ బిడ్ పాడించి, నా నడుము విరగ్గొట్టలేదా? మీరు ట్వెంటీ పెర్సెంట్ పెర్ మన్త్ వడ్డీరేటు అందుకోలేదా? ఇంకా బతికేదేమిటి?" అన్నాడు తిరుమలాపతి నిరాశగా. "సర్లెండి, గురూ? ముందర పోయి, ప్రిన్సిపాల్‌తో మనమే స్టాక్ వెరిఫికేషన్ చేసుకోగలమని చెప్పొద్దాం రండి!" బయలుదేరాడు మోహన్. నలుగురూ లేచారు. ప్రిన్సిపాల్ రూము వైపు వెళ్ళారు. పదినిముషాల తరవాత వెలిగే ముఖాలతో తిరిగి వచ్చారు. నలుగురూ సిగరెట్టు వెలిగించి, కాళ్ళు బల్లలమీద పెట్టి కుర్చీల్లో చేరబడ్డారు.

"అన్నట్లు ఒకటో కృష్ణుడుఎమ్.ఫిల్.కు చదువుతున్నాడు గురూ. లైబ్రరిలో కూర్చుని తెగ రాసేస్తున్నాడు." మోహన్ చటుక్కున నిటారుగా కూర్చొని "వోరి వీణ్ణి తగలెయ్యా! అయితే నేను పి.హెచ్.డి. చేసేస్తాను" అన్నాడు. మర్నాడు మోహన్ తాళం చెవులు ఎగరేసుకుంటూ హడావుడిగా కామన్ రూముకు వచ్చాడు. వస్తూనే మిగిలిన ముగ్గురితోనూ అన్నాడు : "వచ్చేసింది, గురూ! నాకు పి.హెచ్.డి. వచ్చేసింది. కుంకుడుపప్పులో నూనె ఉందని కనిపెట్టాను. రుచిగా ఉంటుందని కూడా తెలిసిపోయింది. ఇంక దాని ఫిజికల్, కెమికల్ ప్రాపర్టీస్ లిస్టు రాసేసి, కమర్షియల్ స్కేల్లో ప్రొడక్షన్ విషయం ఆలోచించటమే ఆలస్యం. ఆర్నెల్లు ఆగండి, గురూ, నాకు డిగ్రీ వచ్చేసినట్టే."

సాధారణంగా అందరికీ దూరంగా ఉంటూ, ఎప్పుడోగాని మాట్లాడని హిస్టరీ లెక్చరర్ సోమలింగం ఈ మాటలు విని దగ్గిరొచ్చి, "అన్నిగింజలల్లోనూ నూనె ఉంటుంది కదండీ! అయినా డిగ్రీకి కనీసం రెండేళ్ళు గడవాలేమో!" అన్నాడు. మోహన్ నిర్లక్ష్యంగా "మీ కెందుకండీ! సైన్సు కాలిగోటికి పోలదు మీ హిస్టరీ. మీరూ మాట్లాట్టమే?" అన్నాడు. "అన్నట్టు, సోమలింగం గారూ! స్టాఫు అసోసియేషన్ మెంబర్‌షిప్ ఫీ పాతిక రూపాయలు ఇవాళివ్వకపోతే బాగుండదు సెక్రెటరీగా చెబుతున్నాను.,"... "ఆయన లక్ష్మీచరణచారిత చక్రవర్తి. ఆవిడగారి అనుమతిలేందే పైస గూడా ఊడిపడదు" అన్నాడు నాగచంద్రం నవ్వుతూ సోమలింగం తెల్లబోయాడు. చిన్న బోయిన మొహంతో "మధ్యాహ్నం తెచ్చిస్తాలెండి" అని లేచి బయటికి వెళ్ళిపోయాడు.

★ ★ ★

నాలుగు రోజులు పోయాక లెక్చరర్లందరూ కామన్ రూములో ఉండగా కర్మసాక్షి అందరికీ బోర్నవిటా తెప్పించారు వాళ్ళు తాగుతూండగా నుంచుని, "మిత్రులందరికీ నమస్కారాలు బాధ్యత

గల ఒక టీచరుగా మీముందు నుంచున్నాను మనలో కొంతమందిమి విధిలేక ఈ వృత్తిలోకి వచ్చిన వాళ్లం. అయినా వచ్చాక మన బాధ్యతలు మనం నిర్వర్తించాలి గదా! పైగా మనమందరం మేధావి వర్గమనీ, సమాజానికి మూల స్తంభాలమనీ ఇతర ప్రపంచమంతా అనుకుంటోంది. అటువంటప్పుడు, కులతత్వాలు, మత తత్త్వాలు, ప్రజాద్రవ్యాన్ని సొంతం చేసుకోవడం వంటి లక్షణాలతో మనకింది విద్యార్థులు తయారైతే సమాజం మనల్ని క్షమిస్తుందా? మనం కలలుగనే సమసమాజ మనేది ఎప్పటికైనా ఆవిర్భవిస్తుందా?... ఇది ఇట్లా ఉండగా, మనలో సైన్సు ఎక్కువ, ఆర్ట్స్ తక్కువ అనే భావం ఉన్నట్టు తోస్తోంది. నిజానికి రెండూ సమానమే. ఆర్ట్స్ మానవుడికి భావౌన్నత్యాన్ని ప్రసాదిస్తే, సైన్సు సుఖమయ జీవితాన్ని ప్రసాదిస్తోంది. ....సమాజంలో ఎంతో మందికి లభ్యం కాని పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీని పొంది మనం, ఆయాశాస్త్రాలను ఇంకా లోతుగా అధ్యయనం చేసి, మేధస్సును విస్తరింప జేసుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా జీవించవలసి ఉండగా, ఇట్లా చవకబారుగా ప్రవర్తిస్తూండటం పట్ల నాకు చాలా బాధగా ఉంది.

"నిన్ననే కాలేజి కమిటి ప్రెసిడెంట్ వచ్చి ప్రిన్సిపాల్ గారితో మాట్లాడి వెళ్ళారు. మనం క్లాసులు వదిలేయటం, స్టూడెంట్స్‌తో దురుసుగా, అసభ్యంగా మాట్లాడటం, ఇక్కడ కామన్ రూమ్‌లో బాధ్యతా రహితంగా ప్రవర్తించే పద్ధతి, కాలేజీ నంతటినీ తమ గుప్పిట్లో పెట్టుకుని నడిపించాలని మనలో కొంతమందికి ఉన్న తపన - ఇవన్నీ వారి మధ్య చర్చింపబడ్డాయని నాకు తెలిసింది. కారణాంతరాల చేత మన ప్రిన్సిపాల్‌గారు మనపట్ల మెతగ్గా ఉన్నారు కానీ ఆయన బాగా సర్వీసు చేసిన వ్యక్తి. ఆయన్ను కూడా తమ అదుపులో ఉంచుకోవాలని కొందరు చేసే ప్రయత్నాలు మొత్తం కాలేజీకే నష్టం కలిగించే ప్రమాదం ఉన్నది. అందరిలో ఒకణ్ణిగా నాకుకూడా దెబ్బ తగలవచ్చునన్న బాధతో మీతో ఈ మాటలు చెబుతున్నానే గాని, మీకన్నా అధికుడననే భావన నాలో ఏ కోశానా లేదు. మీకు కష్టం కలిగిస్తే క్షమించండి."

చేతిలో ఉన్న గాజు గ్లాసును టక్కున బల్లకేసి కొట్టాడు పున్నయ్య. అది బద్దలయింది. ఖాతరు చేయకుండా లేచి నుంచుని "ఆచారిగారి తర్వాత నేను సీనియర్ మోస్టు. ఈ లెక్చరివ్వటానికి మీ కెవడిచ్చాడు అధికారం?" అన్నాడు. కర్మసాక్షి చలించలేదు. "అట్లాగే కానివ్వండి. స్టూడెంట్సు భవిష్యత్తుకు నేను కూడా బాధ్యుణ్ణే కదా."..."బాధ్యతలు - బోడి బాధ్యత! ఆ మాత్రం బాధ్యత మాకూ ఉంది. డైరెక్టర్ లెవెల్లో మాకూ బలం ఉంది. మాకు మీరేం చెప్పనక్కర్లేదు." నలుగురు సైన్సు లెక్చరర్లు బయటకు నడిచారు. కొన్ని క్షణాల తర్వాత ప్రహ్లాదవరదాచారి, తిరుమలాపతీ, డేవిడ్, రెహమాన్, సోమలింగం - వరసగా వాళ్ళ ననుసరించారు. ఇంగ్లీషు లెక్చరరూ, విశాలాక్షీ జాలిగా చూస్తూండగా కర్మసాక్షి వడిలిన మొహంతో కూర్చుండి పోయాడు.

★ ★ ★

మార్చి మొదటి వారంలో ఎవ్వరూ ఊహించని విధంగా ప్రిన్సిపాల్‌కు ట్రాన్స్‌ఫరైంది. కొత్త ప్రిన్సిపాల్ వచ్చి చేరాడు. నాలుగు రోజులు గడిచాక ఒక ఆదివారంనాడు యథాలాపంగా కర్మసాక్షి ఆయనింటికి వెళ్ళాడు. ప్రిన్సిపల్ అతనికి కాఫీ ఇచ్చాడు. పరస్పర గౌరవాభివందనాలు పూర్తయ్యాక ప్రిన్సిపాల్ గెజిటెడ్ రాంకు ప్రమోషన్లను గురించి, పూర్వపు కాలేజీలో తన అనుభవాలను గురించి చాలాసేపు మాట్లాడాడు. ఆఖర్న అడిగాడు! "ఇక్కడ మీకేమయినా సమస్యలున్నాయా?"... "కొత్త కాలేజీ

కదండీ - సర్దుకుపోకతప్పదు"... "మీ లెక్చరర్లందరూ బద్ధకించకుండా టైముకు క్లాసులకు వెడుతున్నారా?"... "వెడుతున్నామండి ఆ విషయంలో మీరు చూసుకోవలసిందేమీ లేదు"... "అయితే నేను ప్రత్యేకించి జాగ్రత్త వహించలసిన విషయాలేవీ లేవన్నమాట?" కర్మసాక్షి పది క్షణాలాగి అన్నాడు : "ఆ (లేనట్లే) సర్ ....కానీ మీరు వీలు చూసుకుని అప్పుడప్పుడు కామన్ రూమ్‌కు వచ్చి మాతో కొంచెం సేపు గడిపితే బాగుంటుందేమోనని పిస్తోంది. ఆ విధమైన ఇష్టా గోష్టి ప్రసంగాల ద్వారా మీనుంచి మేము వృత్తి తాలూకు బరువు బాధ్యతల్ని ఇంకా బాగా అవగాహన చేసుకోవడానికి వీలు కలుగుతుందని నా ఆశ".... "సరే, ఆలోచిస్తాను."

ఆ తర్వాత మరి కొంచెం సేపు రాజకీయాలు, వాతావరణం వగైరాలను గురించి మాట్లాడి కర్మసాక్షి వచ్చేశాడు. ప్రిన్సిపాల్‌తో ఇండెంట్స్ విషయం మాట్లాడాలని వచ్చిన భాస్కర్రావు గోడపక్కన పొంచిఉండి ఈ మాటలన్నీ విన్నాడు. 'ఇంకేం కావాలి, సందు దొరకనే దొరికింది' అనుకొంటూ ఆ సాయంత్రం మిగిలిన సైన్సు లెక్చరర్లందర్నీ పోగేసి ఉన్నవీ, లేనివీ కల్పించి కర్మసాక్షి మీద చెప్పాడు. మర్నాడు ఉదయం కర్మసాక్షి కామన్ రూముకురాగానే ప్రహ్లాద వరదాచారి - "మా అందరిమీద ప్రిన్సిపాల్‌కు చాడీలు చెప్పారట. ఇటువంటి నైచ్యానికి మీరు దిగజారతారని అనుకోలేదు" అన్నాడు. కర్మసాక్షి : "నేను ఎవరిమీదా చాడీలు చెప్పలేదు. అప్పుడప్పుడు కామన్ రూముకు వచ్చి మనతో ఇష్టాగోష్టిగా, మనలో ఒకరుగా ఆయన మసులుతూంటే బాగుంటుందని న్నాను. ఇది తప్పని నేను అనుకోవటం లేదు" అన్నాడు. హఠాత్తుగా పున్నయ్య నుంచుని - "యూ ఆర్ యాన్ ఇడియట్!" అన్నాడు.... "యూ బ్లడీ బాస్టర్డ్ ఆఫ్...." భా.రా. ఆగిపోయాడు. కోపంతో కర్మసాక్షి - "నోరు పారేసుకోకండి" అని లేచి రూము బయటకు వచ్చేశాడు.

ఆ సాయంత్రం స్టాఫు అసోసియేషన్ మీటింగును ఏర్పాటు చేసినట్లు తెలియపరచాడు పున్నయ్య. కర్మసాక్షి ఆ నోటీసు పుస్తకంలో రాశాడు : "ఈ వేళ ఉదయం తిట్టినట్లుగానే మీటింగులో కూడా మీరు నన్ను తిట్టగల అవకాశం ఉంది కనక, ప్రిన్సిపాల్ గారి సమక్షంలో మీటింగు ఏర్పాటు చేసేట్లయితే వస్తాను. లేక పోతే రాను." కర్మసాక్షి లేకుండానే మీటింగు జరిగింది. మెజారిటీ వోటింగుతో కర్మసాక్షిని అసోసియయేషన్‌లో నుంచి బహిష్కరించారు. ఇంగ్లీషు లెక్చరరూ, విశాలాక్షీ వోటింగులో పాల్గొనలేదు.ఇక్కడితో ఆగకుండా పున్నయ్య ఆ మీటింగులో తీసుకున్న నిర్ణయం తాలూకు కాపీని తీసుకెళ్ళి ప్రిన్సిపాల్‌కు ఇచ్చాడు. అందులో "కర్మసాక్షి గారు లెక్చరర్లను గురించి ప్రిన్సిపాల్‌గారికి లేని పోని విషయాలు చాడీలుగా చెప్పటం భాస్కరరావుగారు తనకు తానై విన్నారు. ఈ విషయమై సంజాయిషి ఇవ్వవలసిందిగా కర్మసాక్షిగారిని కోరగా, ఆయన లెక్చరర్ల సమావేశానికి హాజరుకాలేదు. మెజారిటీ వోటింగుతో ఆయన్ను అసోసియేషన్ నుంచి బహిష్కరించటమైనది. ఈ విషయం తమకు విన్నవించుకోవటమైనది - సెక్రటరీ పున్నయ్య."

★ ★ ★

రెండురోజుల పాటు ప్రిన్సిపాల్ లెక్చరర్లందరి ప్రవర్తననూ గమనించాడు. మూడోనాడు విశాలాక్షిని పిలిచి, ఆమె ద్వారా జరిగిన కథనంతనూ రాబట్టాడు. ఆమె వెళ్ళిపోయాక భాస్కరరావును పిలిచి చెప్పాడు : "కర్మసాక్షిగారూ, నేనూ మాట్లాడుకోవటం మీరు పొంచి విన్నవారు వెంటనే నా ఎదుటికి వచ్చి ఆ మాటల్ని ఎందుకు ఖండించ లేదు? దీన్ని బట్టి మా ఇంట్లో సంభాషణ లన్నింటినీ మీరు

రహస్యంగా వింటున్నారనీ, ఆ విన్నవాటిని మీకు తోచిన విధంగా వాడుకుంటున్నారనీ తెలుస్తోంది. మీ మీద నేను డిసిప్లినరీ యాక్షన్ ఎందుకు తీసుకోకూడదో ఈ సాయంత్రంలోగా సంజాయిషీ రాసి ఇవ్వండి. వెళ్ళండి.''

వెంటనే పున్నయ్యను పిలిచి - ''మీ అసోసియేషన్ మీటింగుకు నన్ను పిలవలేదు. అసలు ఈ కథను గురించిన పుట్టు పూర్వోత్తరాలు మీనుండి నేను వినలేదు. హఠాత్తుగా నాకు ఈ కాపీని ఇవ్వటంలో మీ ఉద్దేశ్యం నాకు తలనొప్పి కలిగించాలనా? లేక నేను ఏం చేస్తానో చూడాలనా? పైగా కామన్ రూములో 'ఇడియట్ అనీ, బాస్టర్డ్ ' అనీ మాటలు వినవచ్చాయట కదా! చూడబోతే మీ అసోసియేషన్ అనేది కాఫీలు తాగటానికి, సాటి లెక్చరర్లను బ్రూట్ మెజారిటీతో అవమానించటానికి మాత్రమే ఉన్నట్లున్నదే కామన్ రూము గౌరవాన్ని తుడిచిపెట్టినందుకు మీ అసోసియేషన్ మెంబర్లందరి మీదా డిసిప్లినరీ యాక్షన్ ఎందుకు తీసుకోకూడదో మీ హోదాలో మీరు ఈ సాయంత్రంలోగా నాకు రాసివ్వండి'' అన్నాడు.

ఆ వెంటనే ప్రహ్లాద వరదాచారిని పిలిచి అన్నాడు ప్రిన్సిపాల్ : ''మాష్టారూ! సమాజం ఇంతకాలమూ మిమ్మల్ని పెంచి పెద్దచేసి, మీమీద బాధ్యతలు పెట్టి మిమ్మల్ని వైస్-ప్రిన్సిపాల్‌ను చేసింది మీరు పక్షపాతంతో వ్యవహరించటానికీనూ, మీకన్నా చిన్నవాళ్ళు, కుర్రాళ్ళు తప్పులు చేస్తోంటే వాళ్ళను సమర్థించటానికీనా? కళ్ళు మూసుకుని ఊరుకోవటమే మంచితన మనుకుంటున్నారా? అది మంచితనం కాదు. ఆ ముసుగులో ఉన్న స్వార్థమని నేనంటాను. మీ రేమంటారు?... బాధ్యతారాహిత్యాన్ని సరిదిద్ది, మానవత్వపు విలువల్ని కాపాడటం కోసం చేసే ప్రయత్నమే మంచితనమనిపించుకుంటుంది కాని, స్వార్థంకాదు, మాష్టారూ! ఐ వెరీమచ్ రిగ్రెట్ యువర్ కాండక్ట్! వెళ్ళండి!''

* * *

మర్నాడు ప్రహ్లాదవరదాచారితో సహా నలుగురు సైన్సు లెక్చరర్లు ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్లు తీసుకువెళ్ళగా, ప్రిన్సిపాల్ - ''నేను దగ్గరుండి స్టాక్ వెరిఫికేషన్ చేయించదలుచుకున్నాను. ఆతరవాత రెకమండ్ చేస్తాను'' అని రెండు మూడు క్షణాలు ఆలోచించి మళ్ళీ అన్నాడు : ''అసలు మీరు పాఠాలు బాగానే చెబుతున్నారనుకుంటాను. హఠాత్తుగా మీరు వెళ్ళిపోతే మీ అంత సమర్థులు వెంటనే రారేమో! అసలే కొత్త కాలేజీ కదా! - సారీ, రెకమండ్ చెయ్యను.''

* * *

మర్నాడు కర్మసాక్షి, ఇంగ్లీషు లెక్చరర్, విశాలాక్షి మాత్రమే కామన్ రూములో కూర్చొని ఉండగా, విశాలాక్షి అన్నది . ''ఎట్లా అయితేనేం, బాధ్యతా రాహిత్యానికి'షా' అయింది. ఇంక కాలేజీ బాగు పడుతుంది.''

విశాలాక్షి మెచ్చుకోలు చూపుల్ని అందుకుంటూ కర్మసాక్షి అన్నాడు : ''అవును, కానీ, అసలు, మంచీ చెడుల విజ్ఞతను తాము కలిగి ఉంటూ కూడా, బలవంతులకే భజనచేసే తిరుమలాపతి వంటివాళ్ళవల్లనే మనకు ఎక్కువ అపకారం జరుగుతున్నదని నా అభిప్రాయం ఏమంటారు?''

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 17-8-77))

* * * * * * * * *